## క్లుప్తంగా

### గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఫిరంగిపురం: గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఆరోగ్య సిబ్బంది గుర్తించాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనా బేగం అన్నారు. మండలంలోని వేములూరిపాడులో బుధవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా 104తో పాటుగా ఆరోగ్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ గోవిందయ్య, బాబూరావు, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న పాల్గొన్నారు.

### శాంతి సహనంతోనే క్రీస్తు కృప

ఫిరంగిపురం: శాంతి సహనంతోనే క్రీస్తు కృపను పొందవచ్చని విచారణ గురువు పామిశెట్టి బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో బుధవారం తపస్సుకాల ప్రార్థనలు, విభూదిపండుగను నిర్వహించారు. అనంతరం దివ్యపూజా బలి నిర్వహించి తపస్సుకాల దీక్షల ప్రారంభానికి సూచికగా దీక్షదారులకు విభూదిని నుదుటన పెట్టారు. సాయంత్రం దేవాలయం వెలుపల ఉన్న 14 స్థలాల వద్ద భక్తులతో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సహాయ విచారణ గురువు బొప్పర కిషోర్‌బాబు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

ఫిరంగిపురం: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచి చిట్టా అంజనీదేవి అన్నారు. మండలంలోని రేపూడిలో నిర్మిస్తున్న 75మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చిన్న పరిశ్రమల కార్పొరేషన్ డైరెక్టర్ అంజిరెడ్డి, సీహెచ్ సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గజేంద్ర పాల్గొన్నారు.

### తాగునీటి పైపులైన్లు ఏర్పాటు

తాడేపల్లి రూరల్: రాబోయే వేసవిలో తాగునీటి సమస్యను నివారించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. దానిలో భాగంగా పెనుమాకలో రూ.10 లక్షలు కేటాయించి మూడు ప్రాంతాల్లో పైపులైను నిర్మాణాలను చేపట్టారు. బుధవారం సచివాలయ సిబ్బంది భవాని పర్యవేక్షణలో ఆ పనులు ప్రారంభించారు.

### కృష్ణాజలాలు పరిశీలన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి ప్రాంతంలో కృష్ణాజలాలను అందించేందుకు కార్పొరేషన్ అధికారులు రూ.9 కోట్ల నిధులు కేటాయించారు. అనంతరం పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ.29 లక్షలు కేటాయించి నిర్మాణ పనులు పూర్తి చేశారు. బుధవారం ఆ పనులు పూర్తికావడంతో చివరి ప్రాంతంలో కృష్ణాజలాలు అందుతున్నాయా లేదా అనే విషయంపై సచివాలయ సెక్రటరీ రాధాకుమారి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ సిబ్బంది పరిశీలించారు.

### ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని ముస్లింలు నమ్మరు

తాడేపల్లి రూరల్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేశారని, ముస్లింలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించడం తగదని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాలలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

### ధర్నాను జయప్రదం చేయండి

తాడేపల్లి రూరల్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా శుక్రవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా నిరాకరించడమే కాకుండా విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదని, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు ఇవ్వలేదని, అన్నారు.

### ఘనంగా బేడెన్ పావెల్ జన్మదిన వేడుకలు

తాడికొండ: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండర్ బేడెన్ పావెల్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇండియన్ స్కౌట్స్ అండ్ గిల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిల్డ్ అధ్యక్షులు కె.గోపాల్ రావు, కార్యదర్శి దమ్మాటి రమేష్, త్రిపురనేని మల్లేశ్వరరావు, జి.సుబ్బారెడ్డి, కె.నాగేశ్వరరావు, ఎ.శివశేషు, కె.రామారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఫిరంగిపురం: కిందపడిన బైక్‌ను మరో బైక్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని నుదురుపాడులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పి.తాజ్, వేణుగోపాల్ గుంటూరు నుంచి నరసరావుపేట ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. గ్రామ సమీపంలో వాహనానికి కోతి అడ్డురావడంతో బండి పక్కకు పడిపోయింది. అదే సమయంలో నరసరావుపేట నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం వీరిని ఢీకొంది. ఈ ఘటనలో పి.తాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న శ్రీనునాయక్, హనుమంతురావు, వేణుగోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వీరిని 108లో గుంటూరు జీజీహెచ్‌కు చికిత్స కోసం తరలించారు. పూర్తి సమాచారం తెలియాల్సిఉంది.

### అంగన్‌వాడీ టీచర్ మృతి

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ పరగటి భారతి అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. ఆమె భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి సందర్శించి నివాళులర్పించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



ఆత్మకూరు డివైడర్ మధ్య ఏర్పాటు చేసిన మొక్కలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

తాడేపల్లి రూరల్: భావితరాల భవిష్యత్ కోసం మొక్కలు పెంచే బాధ్యతను ప్రతి ఒక్కరూ స్వీకరించి, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరులో కొత్తగా ఏర్పాటు చేసిన బీటీ రోడ్‌కు ఇరువైపులా డివైడర్‌లను స్వచ్ఛాంధ్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచే విధంగా వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఆయన వెంట కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, నాయకుడు సాంబిరెడ్డి పాల్గొన్నారు.

**అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు**

ఎంటీఎంసీ పరిధిలో అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిదే అని ఎమ్మెల్యే ఆర్కే పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే, కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. తొలుత 6వ బెటాలియన్ ఏర్పడిన దగ్గర నుంచి మురుగునీటి సమస్య ఉండడంతో అక్కడ డ్రైన్ నిర్మాణం చేపట్టారు. డ్రైన్ నిర్మాణ పనులు చేసే సమయంలో ఎక్కడైనా కల్వర్టు నిర్మించాలంటే అధికారుల దృష్టికి తీసుకు వచ్చి వాటిని కూడా పూర్తి చేయాలని, డ్రెయిన్ నిర్మాణం పూర్తయిన తర్వాత వాటిని పగలకొట్టవద్దని పేర్కొన్నారు. అనంతరం చేనేత బజార్, కోనేరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

**మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి**

తాడేపల్లి రూరల్: మత్స్యకారులు వ్యాపారం చేసుకునేందుకు ఫిష్ ఆంధ్ర పేరుతో మార్కెట్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. బుధవారం తెల్లవారుజామున కృష్ణాతీరంలోని పలు ప్రాంతాల్లో మత్స్యశాఖ డి.ఎఫ్.ఓ. రఘునాథరావు, ఎఫ్‌డీఓ సిహెచ్.ప్రసాద్‌లతో కలసి పర్యటించారు. కృష్ణానది దిగువ ప్రాంతంలో రోడ్డు వెంబడి మహిళలు చేపలు అమ్ముకోవడానికి ఎమ్మెల్యే ఆర్కే గమనించి వారితో మాట్లాడారు. మీరు పట్టిన చేపలను అమ్ముకోవడంతో పాటు అమ్ముకోవడంతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో లభించే చేపలను మీ వద్దకు చేర్చి అమ్ముకోవడం కోసం ఫిష్ ఆంధ్ర పేరుతో షాపులను ఏర్పాటు చేసుకునేందుకు సబ్సిడీపై రుణాలు అందజేస్తున్నారని, వాటిని ఉపయోగించుకుని కృష్ణాతీరంలో మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతంలో పుష్కర ఘాట్‌కు వచ్చే దారిలో మత్స్యకారుల భవనం వెనుక ఫిష్ ఆంధ్ర పేరుతో మార్కెట్‌ను ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించారు. మత్స్యకారులకు అవసరమైన మంచి నీరు, ఇతర మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి స్థలాన్ని పరిశీలించారు. మత్స్యకార కార్యాలయంలో వున్న సామాగ్రిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుష్కర ఘాట్లలో కూడా మత్స్యకారులకు సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ఎస్టీ సెల్ పట్టణ కన్వీనర్ బాలసాని అనీల్ పాల్గొన్నారు.


మత్స్యకార మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

### వంటసామగ్రి అందజేత

తాడేపల్లి రూరల్: డాక్టర్ వైఎస్సార్ కమ్యూనిటీ హాల్‌కు ప్రజలు రూ.11 లక్షలతో వంట సామగ్రి, ఏసీలను కొనుగోలు చేసి కార్పొరేషన్ అధికారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ కమ్యూనిటీ హాల్ గత కొంతకాలంగా ఆక్రమణకు గురైందని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చొరవతో తిరిగి కమ్యూనిటీ హాల్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఎంటీఎంసీ అధికారులు కోటి రూపాయల వ్యయంతోఅన్ని సౌకర్యాలు కల్పిస్తూ ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చారని చెప్పారు. కళ్యాణ మండపంలో వంటసామగ్రి, డైనింగ్ టేబుల్స్, కుర్చీలు, ఏసీలు లేకపోవడంతో గ్రామంలోని అందరి సహాయ సహకారాలతో వెయ్యిమందికి వంటచేసే విధంగా వంట సామగ్రి, 8 ఏసీలు బహూకరించినట్లు తెలిపారు.

### మత్తు పదార్థాలపై అవగాహన

తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై నవజీవన బాల భవన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గొల్లమూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తుతో చెలగాటం వద్దు అని, మత్తుపదార్థాల జోలికి వెళ్లవద్దు అని సూచించారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ బి.రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు ఎస్.శ్రీదేవి, కె.కృష్ణప్రియ, ఎస్.హారికృష్ణ, మురళి పాల్గొన్నారు.

# అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన


తాడికొండలో అంబేడ్కర్ విగ్రహానికి శంకుస్థాపన చేస్తున్న కత్తెర సురేష్ కుమార్‌సరోజినీ

తాడికొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి కత్తెర సురేష్, సర్పంచి తోకల సరోజినీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు అంబేడ్కర్‌గా కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచి తోకల సరోజినీ, ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, పాములపాడు, కంతేరు సర్పంచులు బిక్కి శివరామకృష్ణ, బెజ్జం మహేష్ బాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ తాళ్ళ శ్రీనివాసరెడ్డి, నాయకులు తాళ్ళ శివనాగరాజు యాదవ్, బాకి వెంకటస్వామి, కొప్పుల శేషగిరిరావు, దేవరపల్లి చినపాములు, గద్దె రూబేన్ పాల్గొన్నారు.

**సామాజిక న్యాయానికి పెద్దపీట**

తాడికొండ: సామాజిక న్యాయానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం తాడికొండ గాంధీ పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ భావజాలంతో దేశంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి జగనన్న మాత్రమే అన్నారు.

శాసన మండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించి ఇచ్చిన మాటకు కట్టుబడి రాజ్యాధికారం దిశగా బహుజనులను నడిపిస్తున్న జగనన్నకు అండగా ఉంటామన్నారు. సమావేశంలో సర్పంచి తోకల సరోజినీ, మాజీ ఎంపీపీలు కొమ్మినేని రామచంద్రరావు, బండ్ల పున్నారావు, కంతేరు, పాములపాడు సర్పంచ్‌లు బెజ్జం మహేష్ బాబు, బిక్కి శివరామకృష్ణ, ముఖ్య నాయకులు తాళ్ళ శివనాగరాజు, కొమ్మినేని పున్నారావు, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# తాళ్లూరి నగర్‌లో రూ.8 లక్షలతో రోడ్డు నిర్మాణం


తాళ్లూరి నగర్‌లో నిర్మిస్తున్న గ్రావెల్‌రోడ్

తాడేపల్లి రూరల్: ఉండవల్లి– తాళ్లూరి నగర్‌లో ఎంటీఎంసీ నిధులతో బుధవారం మరో కొత్త రోడ్డు నిర్మాణాన్ని కార్పొరేషన్ అధికారులు చేపట్టారు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు వద్ద ఉన్న తాళ్లూరి నగర్ ఏర్పడి 15 సంవత్సరాలు అయినా ఇప్పటి వరకు ఎటువంటి రోడ్డు నిర్మాణం లేదు. ఎమ్మెల్యే ఆర్కే ఇటీవల ఉండవల్లిలో పర్యటించిన సమయంలో ఆ ప్రాంత ప్రజలు రోడ్డు నిర్మాణం చేయాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సచివాలయ సిబ్బందితో ప్రతిపాదలను సిద్ధం చేయించి 7 మీటర్ల వెడల్పున 590 మీటర్ల పొడవున 4 అడుగుల ఎత్తులో గ్రావెల్ రోడ్ నిర్మాణం చేపట్టారు. అలాగే ముగ్గ రోడ్డు సాయి నగర్ వద్ద కూడా నివాసాలను కలుపుకుంటూ పంట పొలాల్లో మరో గ్రావెల్‌రోడ్ నిర్మాణం చేపట్టినట్లు సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది సందీప్ తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఈ రోడ్డు నిర్మాణాలు పూర్తి అవుతాయని ఆయన అన్నారు.

# అనుమతి లేని కలప స్వాధీనం

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని ఆత్మకూరు టేకు తోట నుంచి అనుమతులు లేకుండా ఆటోల్లో అక్రమంగా టేకు కర్రలను తరలిస్తుండగా బుధవారం సచివాలయ రెవెన్యూ సిబ్బంది ఆటోను సీజ్ చేసి మంగళగిరి తహసీల్దార్ రామ్‌ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి పట్టణ రూరల్ పరిధిలో పలుచోట్ల టేకు తోటల పెంపకం నిర్వహించారని, అటవీశాఖ అధికారుల అనుమతి లేకుండా చెల్లించాల్సిన సుంకం చెల్లించకుండా అక్రమంగా టేకు కలపను తరలిస్తున్నారని, అలా తరలించడం చట్టరీత్యా నేరమని, ఆత్మకూరు టేకు తోటలో గత 20 రోజుల నుంచి అక్రమంగా టేకు దుంగలను తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, జరుగుతున్న ఈ అక్రమ రవాణాపై ఫారెస్ట్ అధికారులతో కలసి విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎవరైనా తమ వ్యక్తిగతంగా టేకు గానీ, ఎర్రచందనం గాని, శ్రీగంధం చెట్లను గానీ పెంపకం నిర్వహిస్తే వాటిని అమ్ముకునే సమయంలో తప్పని సరిగా రెవెన్యూ అటవీ శాఖ వారికి సమాచారం ఇవ్వాలని అన్నారు.

# తొమ్మిదేళ్ల తరువాత కొడుకు చెంతకు..

- మతిస్థిమితం లేక తప్పిపోయిన మహిళ
- కేరళలోని గాంధీ భవన్ ట్రస్ట్‌లో ఆశ్రయం..
- చికిత్స అనంతరం బంధువులకు అప్పగింత
- ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు


చిట్టిబొమ్మ రాజ్యలక్ష్మిని కొడుకు రాజేష్‌కు అప్పగిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

తాడేపల్లి రూరల్: భర్తను కోల్పోయి మతిస్థిమితం లేని ఓ మహిళ తొమ్మిది సంవత్సరాల క్రితం తప్పిపోయింది. అప్పట్లో వారి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా వెతికినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. ఓ ట్రస్ట్ ద్వారా ఆ మహిళ దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన తన కుమారుడికి చెంతకు బుధవారం చేరింది. దుగ్గిరాల పోలీసులు తెలిపిన వివరాలు.. దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన చిట్టిబొమ్మ గణేష్, రాజ్యలక్ష్మి దంపతులు. వ్యవసాయ చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. విధి వక్రీకరించడంతో గణేష్ అనారోగ్యంతో మృతి చెందాడు. అనంతరం రాజ్యలక్ష్మికి భర్తపోయిన బాధలో మానసికంగా కుంగిపోయి మతిస్థిమితం కోల్పోయింది. ఎక్కడికో వెళ్లిపోయింది. అప్పట్లో బంధువులు, చిన్నవయసులో ఉన్న కొడుకు రాజేష్ పలు ప్రాంతాలో విస్తృతంగా వెతికి పోలీస్ కేసు పెట్టినా ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. తప్పిపోయిన రాజ్యలక్ష్మి చివరకు కేరళలోని కొలాం ప్రాంతంలో ఉన్న గాంధీభవన్ ట్రస్ట్‌కు చేరింది. అక్కడ ట్రస్ట్ వారు ఆమెకు ఆశ్రయం కల్పించారు. ట్రస్ట్ ఆధ్వర్యంలోమానసిక వైద్యం చేయించారు. ఆమెకు గతం గుర్తుకు వచ్చి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండల రేవేంద్రపాడు అని చెప్పి తన కుమారుడి పేరు చిట్టిబొమ్మ రాజేష్ అని చెప్పడంతో ట్రస్ట్ నిర్వహకులు దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, దుగ్గిరాల ఎస్ఐ శ్రీనివాస రెడ్డి ద్వారా రాజ్యలక్ష్మి రాజేష్ తల్లేనని గుర్తించారు. అనంతరం రాజేష్‌కు ట్రస్ట్ సభ్యులు ఏమీ చెప్పకుండా కేరళ నుంచి వీడియో కాల్ చేసి అతడి తల్లితో మాట్లాడించగా తప్పిపోయిన తన తల్లి రాజ్యలక్ష్మిని గుర్తించి ఆమెతో ఆప్యాయంగా మాట్లాడాడు. తల్లి కొడుకునుగుర్తించి యోగక్షేమాలు కనుక్కోవడంతో ట్రస్ట్ సభ్యులు ఆమెను కేరళ నుంచి దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చి పోలీసుల సమక్షంలో కొడుకు రాజేష్‌కు అప్పజెప్పారు. కొడుకును చూడగానే ఆ తల్లి కన్నీరు మున్నీరు అయిందని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దుగ్గిరాల తహసీల్దార్‌తో పాటు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి గాంధీభవన్ ట్రస్ట్ నిర్వాహకులు చేసిన సేవకు ధన్యవాదాలు తెలిపారు.

# గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

ఫిరంగిపురం: గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం బుధవారం గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక క్రీస్తునగర్ శివారులోని ఓ ప్రయివేట్ కళాశాల ప్రహరీ పక్కన ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తు పట్టలేని విధంగా ఉంది. దుర్వాసన వస్తుండటంతో స్థానికులు వీఆర్వో సురేష్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఇచ్చిన సమాచారంతో బుధవారం పోలీసులు పరిశీలించారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో 9440900876 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఎం. లక్ష్మీనారాయణరెడ్డి కోరారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీదేవి


వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

మేడికొండూరు: ప్రజా ప్రయోజనార్థం ప్రజలకు ఉచిత మినరల్ వాటర్ అందించాలనే లక్ష్యంతో ఆళ్ల శ్రీనివాసరావు తన సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. మండలంలోని భీమినేనివారిపాలెంలో గ్రామ సర్పంచి సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే శ్రీదేవి బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు తాగేందుకు నీరు అందించాలనే ఉద్దేశంతో ప్లాంట్ నిర్మించడం జరిగిందన్నారు. వాటర్ ప్లాంట్ పెట్టడం ప్రజలకు ఉయోగమన్నారు. ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంటుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, వైస్ ఎంపీపీ రాజశేఖరరెడ్డి, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, ఎంపీడీఓ శోభారాణి పాల్గొన్నారు.

## తాడేపల్లిలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం



తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో తాడేపల్లి సలాం సెంటర్ సచివాలయంలో బుధవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 17 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. మరో 5 మందికి కంటి శుక్లం ఆపరేషన్ నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు.

## మహామృత్యుంజయ జప విశ్వశాంతి మహాయాగం



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో దేవాలయ భూముల్లో బుధవారం శ్రీశైలం లలిత పీఠం శ్రీనివాసనందస్వామి ఆధ్వర్యంలో మహామృత్యుంజయ జప(దోష) విశ్వశాంతి మహాయాగ పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు కనసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి జూలై 9వ తేదీ వరకు యాగం నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిరోజు గోపూజ, భూమి పూజ చేశామని, అనంతరం యాగశాల నుంచి ఉండవల్లి గ్రామ దేవత గంగానమ్మ దేవాలయం వరకు గ్రామోత్సం నిర్వహించి అమ్మ వారికి సారె సమర్పించామని అన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ఎస్సీ కాలనీలో వివిధ కారణాలతో కుటుంబ పెద్దలను కోల్పోయి విషాదంలో ఉన్న కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అందజేసిన లక్ష రూపాయల సాయాన్ని బుధవారం అందజేశారు. వలంటీర్ చింతాబత్తుని ప్రమోద్ ఇటీవల మృతిచెందాడు. కుటుంబానికి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే కాలనీకి చెందిన జ్యోతుల సుబ్బారావు, అతడి భార్య ఇద్దరూ అనారోగ్యం ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేలు అందించారు. ఈమని గ్రామానికి చెందిన వలంటీర్ అమర్తలూరి నాగరాజు ఇటీవల అనారోగ్యానికి గురై బాధపడుతుండడంతో వైద్య నిమిత్తం 10 వేల రూపాయలు అందజేశారు. వలంటీర్‌గా పనిచేస్తున్న జెట్టి రజిత భర్త అనారోగ్యానికి గురికావడంతో ఆ కుటుంబానికి 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎస్సీ కాలనీకి చెందిన మెరుగుమాల గ్రేస్‌మేరి అనారోగ్యంతో బాధపడుతుండడంతో రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, శాప్ స్టేట్ డైరెక్టర్ పిల్లి శైలజ, ఈమని సహకార సొసైటీ చైర్మన్ నలకుర్తి యేసుపాదం, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మత్తే ఆనంద్, కాంతారావు, డీవీఆర్, లోకేష్, మారుతి, కత్తిక శ్రీను పాల్గొన్నారు.

## నల్లతామర నివారణకు చర్యలు తీసుకోవాలి



లాం(తాడికొండ): మిర్చిలో నల్లతామర నివారణకు సోలార్ ట్రాప్, బ్లూ రంగు అట్టల వాడకం తప్పనిసరి అని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు విభాగం రాష్ట్ర అధికారి ఇర్ఫాన్ అన్నారు. తాడికొండ మండలం లాం గ్రామంలో మిర్చి పంటను పరిశీలించిన పలువురు ప్రాజెక్టు సభ్యులు మిర్చిలో అధికంగా నల్లతామర పురుగులు గమనించడం జరిగిందన్నారు. ఉల్లిగడ్డల కషాయం వాడటం ద్వారా 80 వవాతం వరకు నివారణ చేయవచ్చు కనుక రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను వాడి అధిక ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పి.వెంకట రమణ, ఇవుల ఝాన్సీ రాణి, ఆర్.దేవమ్మ, పి.వసంతి పాల్గొన్నారు.

### తుళ్లూరులో జూదరుల అరెస్టు

తాడికొండ: తుళ్లూరులో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి ఏడుగురు జూదరులను అరెస్టు చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. సీఐ ఆనందరావు తెలిపిన వివరాలు.. గ్రామంలోని పంట పొలాల్లో పేకాటాడుతున్న సమాచారం మేరకు ఎస్ఐ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. జూదరులను అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి రూ.4590, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.